క్లుప్తంగా

జాతీయస్థాయికి ఎదగాలి



వాలీబాల్ ఆడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూరు(సిద్దిపేట): క్రీడాకారులు గ్రామ స్థాయి నుంచి జాతీయస్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మండల పరిధిలోని గోనెపల్లిలో మండలస్థాయి వాలీబాల్ క్రీడలను శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోషల్ మీడియాతో పిల్లల్లో క్రీడా స్ఫూర్తి లేకుండా పోతుందన్నారు. పిల్లలకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, సర్పంచ్ స్వరూప ఎల్లాగౌడ్, ఎంపీటీసీ పద్మ మల్లేశం, బీఆర్ఎస్ నాయకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోండి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వర్గల్(గజ్వేల్): ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం అమలుచేస్తున్న కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. శనివారం వర్గల్ మండలం గౌరారంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ యాదగిరి తదితర అధికారులు పీఎం సురక్ష బీమా, పీఎం జీవనజ్యోతి, ముద్ర లోన్లు, అటల్ పెన్షన్ యోజన, ఆరోగ్య సేవలు, పీఎం ఉజ్వల యోజన, పీఎం కిసాన్ తదితర పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వినోద, సీసీ పద్మలత, కార్యదర్శి శ్రీనివాస్, బీజేపీ నాయకులు మహిపాల్‌యాదవ్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



మందకృష్ణ మాదిగకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను ఆ సంఘం నాయకులు శనివారం కలిశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశంపై ఢిల్లీ పర్యటన ముగించుకొని హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి శేఖర్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్‌మాదిగ, జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణమాదిగ, నాయకులు రమేష్, హరీష్, ఆదిత్య తదితరులు మందకృష్ణకు పుష్పగుచ్ఛం అందజేసి పండగ శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడలతో శారీరక దృఢత్వం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వంశీధర్‌రావు

చిన్నకోడూరు(సిద్దిపేట): క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని కేఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్‌రావు అన్నారు. మండలపరిధిలోని చంద్లాపూర్‌లో సూరగోని మల్లయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు శ్రీనివాస్‌గౌడ్ నిర్వహిస్తున్న మండలస్థాయి క్రికెట్ టోర్నీని శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు హరిబాబు, ఆశమ్మగారి శ్రీకాంత్, భిక్షపతి, శ్రీకాంత్, ఎజాజ్ పటేల్, సురేందర్, సురేష్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మైనంపల్లి' ప్రత్యేక పూజలు

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని దిలాల్‌పూర్‌లో గల శ్రీలక్ష్మీ నారసింహస్వామి దేవాలయంలో మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా శనివారం ప్రజ్ఞాపూర్‌లో స్థానిక కాంగ్రెస్ నాయకులు మైనంపల్లికి స్వాగతం పలికారు. అనంతరం ప్రజలంతా సంతోషంగా ఉండాలని, తెలంగాణ దేశానికే ఆదర్శంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

మది నిండుగా.. సంక్రాంతి పండగ

నేడు భోగితో ప్రారంభం కానున్న సంబరాలు



దుబ్బాకలో రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు



బెజ్జంకి: తోటపల్లిలో ముగ్గులు వేస్తున్న మహిళలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): సంక్రాంతి అనగానే గుర్తుకొచ్చేది పల్లె వాతావరణం. పాడి పంటలు, బసవన్నలు, హరిదాసుల సంకీర్తనలు, పిండి వంటలు. ఇప్పటికే చాలా మంది పట్టణాల నుంచి పల్లెలకు చేరుకున్నారు. సంక్రాంతిని సంబురంగా జరుపుకునేందుకు సిద్ధం అవుతున్నారు. మొదటి రోజు భోగితో మొదలై కనుమ వరకు రోజుకో తీరుతో పండగను జరుపుకుంటారు. భోగి రోజు ఉదయాన్నే మహిళలు ఇంటి ముందు ముగ్గులు వేసి వీధుల్లో భోగి మంటలు వేస్తారు. నువ్వుల పులగం, పొంగలి తయారు చేస్తారు. ప్రధానంగా సాయంత్రం చిన్న పిల్లలకు భోగి పళ్లు పోసి పేరంటం జరుపుతారు. బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తారు. రెండో రోజు సంక్రాంతి రోజు సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశిస్తాడు. ఈ రోజుతో దక్షిణాయనం ముగిసి ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమవుతుంది. బెల్లం, గుమ్మడికాయలు దానమిచ్చి పితృదేవతలకు తర్పణాలు వదులుతారు. అలాగే ఇంటి ముందు తీరొక్క రంగులతో ముగ్గులు వేస్తారు. ఇక మూడో రోజు కనుమను పశువుల పండగ అంటారు. వ్యవసాయదారులు పశువులను శుభ్రంగా కడిగి పసుపు, కుంకుమ, పూలతో అలంకరిస్తారు. కనుమ రోజు గారెలు చేసుకుని తింటారు. పుట్టింటికి వచ్చిన ఆడపిల్లలు అత్తింటికి వెళ్లిన అల్లుళ్లు కూడా కనుమ రోజు తిరుగు ప్రయాణమవ్వరు. కనుమ నాడు కాకి కూడా కదలదని పెద్దలు అంటారు.

హరిదాసులు, గంగిరెద్దుల ఆటపాటలు



పండగ రోజు తెల్లవారుజామునే హరిదాసు హరినామ సంకీర్తనలు, సాతాని జియ్యర్లు, జంగపుదేవరలు, బుడబుక్కల దొరలు, పంబలి, బైండ్ల, గంగిరెద్దుల వాళ్లు ఇంటి ముందు వాలుతారు. చక్కగా అలంకరించిన గంగిరెద్దులను ఇంటింటికి తిప్పుతూ డోలు, సన్నాయి రాగాలకు అనుగుణంగా వాటిచేత నృత్యం చేయిస్తుంటారు. అలాగే సంక్రాంతి ముందు రోజు నుంచే గ్రామాల్లో పతంగుల ఆటలు ప్రారంభం అవుతాయి. చిన్నారులు గ్రామాల్లో పెద్దలు, పిల్లలు కలిసి పతంగులు కొనుగోలు చేసి సందడి చేస్తారు.



కొండపోచమ్మ ఆలయం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న ఏసీపీ రమేష్

బ్రహ్మోత్సవాలకు భారీ బందోబస్తు

గజ్వేల్ ఏసీపీ రమేష్

జగదేవ్‌పూర్(గజ్వేల్): కొండపోచమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఏసీపీ రమేష్ అన్నారు. శనివారం మండలంలోని కొండపోచమ్మ ఆలయాన్ని సందర్శించారు. జాతరకు సంబంధించిన బందోబస్తుపై పోలీసులు, ఆలయ సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 22 నుంచి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని, మొదటి వారం భక్తులు వేల సంఖ్యలో రావడంతో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. మూడు చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని, భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. రోడ్డుపై పార్కింగ్ చేయొద్దని కోరారు. జాతర ముగిసే వరకు ఆలయ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఐ జానకిరాంరెడ్డి, ఎస్ఐ చంద్రమోహన్, సర్పంచ్ రజిత, ఈఓ మోహన్‌రెడ్డి, సిబ్బంది వెంకట్‌రెడ్డి, కనకయ్య, సుధాకర్, హరి, చిన్నా, చందు, కార్యదర్శి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

గజ్వేల్‌రూరల్: ఆయిల్‌పామ్ సాగు చేయడం వల్ల అధిక లాభాలు పొందవచ్చని ఉద్యానవనశాఖ అధికారి సౌమ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లి, రంగంపేట గ్రామాల్లో రైతులు సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటలను క్షేత్ర పరిశీలన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని, ఆయిల్‌పామ్ సాగులో అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. అనంతరం నీటి యాజమాన్యం, సమగ్ర పోషక యాజమాన్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ అధికారి వాలినాథ్, ఆయా గ్రామా ల ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

గజ్వేల్/గజ్వేల్‌రూరల్/బెజ్జంకి(సిద్దిపేట): గజ్వేల్ పట్టణంలో గల 13వ వార్డు వాసవినగర్‌లో సహాయ యూత్ ఆధ్వర్యంలో శనివారం ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా కౌన్సిలర్ షహనాజ్ సమీర్ మాట్లాడుతూ.. కులమతాలకతీతంగా మహిళలు ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని భారత్‌నగర్ (19వవార్డు)లో కౌన్సిలర్ గుంటుకు శిరీష ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. బెజ్జంకి మండలంలోని తోటపల్లిలో సర్పంచ్ నర్సింగరావు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న కౌన్సిలర్

వైభవంగా వెంకటేశ్వరుని కల్యాణం

దుబ్బాకటౌన్: తెలంగాణ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన పట్టణంలోని బాలాజీ ఆలయంలో శనివారం ధనుర్మాసం చివరిరోజు సందర్భంగా వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా హాజరై స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించి తరించారు. బలగం సినిమా నటుడు ఐరేని మురళీధర్‌గౌడ్ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వడ్లకొండ శ్రీధర్, బాధ్యులు చింత రాజు, ఆకుల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

నంగునూరు(సిద్దిపేట): ధనుర్మాసం పురస్కరించుకొని పాలమాకుల వేంకటేశ్వరాలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. తిరుప్పావై అనుసంధానంలో భాగంగా పాశుర పఠనం, స్వామివారి అర్చన, గోధామాత కల్యాణ విశిష్టతను పూజారి విష్ణుతేజాచార్యులు భక్తులకు వివరించారు.



నంగునూరు: పాశుర పఠనం చేస్తున్న మహిళలు



దుబ్బాకటౌన్: కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

వలసొచ్చిన కుటుంబానికి శోకమే మిగిలింది

జగదేవ్‌పూర్(గజ్వేల్): వలసొచ్చిన కుటుంబానికి పుట్టెడు దుఃఖమే మిగిలింది. అనారోగ్యంతో భర్త మృతిచెందగా అయినవాళ్లు రాకపోవడంతో ఊరే బంధువులుగా మారి అంత్యక్రియలు పూర్తి చేశారు. తోచిన సహాయం చేసి అండగా నిలిచారు. ఈసంఘటన మండలంలోని వట్టిపల్లిలో శనివారం జరిగింది. నిర్మల్ జిల్లా కుంభి గ్రామానికి చెందిన నరేష్ (38)కు భార్య సంధ్య ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. తమ సొంత గ్రామంలో ఎలాంటి ఆస్తులు లేకపోవడంతో ఏడాది క్రితం వట్టిపల్లికి వలసవచ్చి గ్రామంలోని ఓ పౌల్ట్రీఫాంలో పనిచేస్తూ జీవనం సాగించారు. ఆరునెలల తర్వాత అక్కడ పని మానేసి గ్రామంలో అద్దెకు ఇల్లు తీసుకుని మేస్త్రీ పనులు చేసుకుంటున్నారు. ముగ్గురు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నారు. కాగా పది రోజులుగా నరేష్ అనారోగ్యం బారిన పడ్డాడు. భార్య దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించింది. పచ్చకామెర్ల ఉన్నాయని తెలుపగా చేర్యాలలోని ఓ ఆస్పత్రిలో చూపించింది. ఆరోగ్యం విషమించి శుక్రవారం నరేష్ మృతి చెందాడు. బంధువులకు ఫోన్ చేసినా ఎలాంటి స్పందన రాకపోవడంతో గ్రామస్తులు అంత్యక్రియలు పూర్తి చేశారు. ముగ్గురి పిల్లలతో ఇదే గ్రామంలోనే ఉంటానని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని సంధ్య విజ్ఞప్తి చేసింది.



భర్త మృతదేహం వద్ద భార్య పిల్లలు

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

సిద్దిపేటఅర్బన్: మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఈసంఘటన మండలంలోని బక్రిచెప్యాలలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లోజు రమేష్ (34) వడ్రంగి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్నేళ్లుగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. మందులు వాడినా ఫలితం లేకపోవడంతో తరచూ బాధపడుతుండేవాడు. ఈక్రమంలో శుక్రవారం సిద్దిపేటకు పని మీద వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి వెళ్లలేదు. పొన్నాల శివారులో ఆత్మహత్య చేసుకున్నట్టు శనివారం గుర్తించారు. మృతుడి తండ్రి సుదర్శన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రాములోరి అక్షింతల పంపిణీ

హుస్నాబాద్/చిన్నకోడూరు(సిద్దిపేట)/నంగునూరు/దుబ్బాకటౌన్/మద్దూరు: అయోధ్య రాములోరి అక్షింతలను శనివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. హుస్నాబాద్ పట్టణంలోని 5వ వార్డులో కౌన్సిలర్ పెరుక భాగ్యరెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అంతకుముందు హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, రత్నమాల, దొడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే చిన్నకోడూరు మండల పరిధిలోని ఇబ్రహీంనగర్, అనంతసాగర్, చర్లఅంకిరెడ్డిపల్లి, గంగాపూర్ గ్రామాల్లో ఇంటింటికీ పంపిణీ చేశారు. నంగునూరు మండలంలోని పలు గ్రామాల్లో అక్షింతలను పంపిణీ చేశారు. దుబ్బాక పట్టణంలోని 13వ వార్డులో కౌన్సిలర్ ఆస సులోచన స్వామి ఆధ్వర్యంలో ఇంటింటా పంపిణీ చేశారు. మద్దూరు మండలంలోని లద్నూరు గ్రామంలో అయోధ్య పూజిత అక్షింతలను గడప గడపకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జీడికంటి సుదర్శన్, ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు దాసరి పద్మారెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సోగాల మనోజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్‌లో అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ

పోదాం పద పొట్లపల్లి

నేటి నుంచి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు



జాతరకు ఎడ్ల బండి సిద్ధం చేస్తున్న కుటుంబం

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పొట్లపల్లిలో నేటి నుంచి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. భోగి (ఆదివారం) రోజు సీతారామాలయంలో గోదాదేవి, రంగనాయకుల కల్యాణ మహోత్సవం, మల్లికార్జునస్వామి ఆలయంలో శివకల్యాణం నిర్వహిస్తారు. కల్యాణ మహోత్సవాలను తిలకించేందుకు చుట్టు పక్క గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. మల్లికార్జునస్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహాలు లేకపోవడంతో మూల విరాట్‌కు కల్యాణం నిర్వహిస్తారు. సంక్రాంతి రోజున ఇంటింటా మల్లన్న బోనాలు చేసి స్వామివారికి భక్తులు మొక్కులు సమర్పిస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి స్వామివారి పట్నాలు వేస్తారు. మూడు రోజులుగా నిర్వహించే మల్లికార్జునస్వామి ఉత్సవాలు అగ్నిగుండాలతో ముగుస్తాయి. పుణ్యక్షేత్రాలకు నిలయంగా ఉన్న పొట్లపల్లికి భక్తుల రాక ప్రతి ఏటా పెరుగుతూ వస్తోంది.



ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు



పార్టీలో చేరిన వారితో మంత్రి పొన్నం ప్రభాకర్

కాంగ్రెస్‌లో చేరికలు

సిద్దిపేటరూరల్/ప్రశాంత్‌నగర్: సిద్దిపేట పట్టణ మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకుడు మంతెన రాజు నరేందర్ మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో శనివారం గాంధీభవన్‌లో కాంగ్రెస్‌లో చేరినట్లు సిద్దిపేట కాంగ్రెస్ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు బొమ్మల యాదగిరి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కిష్టారెడ్డి, రాష్ట్ర సేవాదళ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే నారాయణరావుపేట మండలం గుర్రాలగొందికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

సంక్షిప్త వార్తలు

◆ మోటారు వైర్ల చోరీ

సిద్దిపేటరూరల్: వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన మోటార్ల నుంచి వైర్లను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఈసంఘటన మండల పరిధిలోని రాఘవాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. రైతులకు చెందిన 7 మోటార్ల నుంచి వైరును దుండగులు ఎత్తుకెళ్లారు. సుమారు రూ. 50 వేల ఖరీదు ఉంటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

◆ నూతన నియామకం

హుస్నాబాద్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్‌గా మాదాసు శ్రీనివాస్‌ను నియమించారు. ఈమేరకు శనివారం ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కో ఆర్డినేటర్ గోవిందు వెంకటేశం నియామకపత్రం అందజేశారు.

◆ గుండెపోటుతో కార్మికుడు మృతి

తొగుట(దుబ్బాక): గ్రామ పంచాయతీ సఫాయి కార్మికుడు గుండెపోటుతో మృతిచెందిన సంఘటన మండలంలోని వెంకట్రావుపేటలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఈదుగల్ల భిక్షపతి (59) కొంతకాలంగా గ్రామ పంచాయతీ సఫాయి కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం గ్రామంలో వీధులు శుభ్రం చేసి ఇంటికి వచ్చి భోజనం చేసి పడుకున్నాడు. అర్ధరాత్రి తర్వాత నిద్రలేచి ఛాతీలో నొప్పిగా ఉందని కుటుంబీకులకు తెలిపాడు. దీంతో వారు గ్రామంలోని ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యుడు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడి కుటుంబాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి పరామర్శించారు.

◆ పరామర్శ

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండల పరిధిలోని గోపులాపూర్, కోదండరావుపల్లిలో ఇటీవల మృతిచెందిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే హరీశ్‌రావు శనివారం పరామర్శించారు. గోపులాపూర్‌కు చెందిన సీనియర్ నాయకురాలు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మోతె హన్మవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. అదేవిధంగా కోదండరావుపల్లికి చెందిన ఇద్దరు యువకులు లోకేష్, వంశీ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

◆ మహిళ అదృశ్యం



గజ్వేల్‌రూరల్: కుటుంబ కలహాలతో ఓ మహిళ ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంఘటన శనివారం గజ్వేల్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ధరిపల్లి మౌనిక- రాజశేఖర్ దంపతులకు కొడుకు, కూతురు ఉన్నారు. అత్తా, మామతో పాటు భర్త తరచుగా గొడవపడుతున్నాడని మనస్తాపంతో ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మౌనిక తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

◆ కేంద్ర పథకాలపై ప్రచారం

మిరుదొడ్డి(దుబ్బాక): వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో భాగంగా మిరుదొడ్డిలో శనివారం యూనియన్ బ్యాంక్ మేనేజర్ జెమ్ నాయక్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు కేంద్ర పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం సీనియర్ సిటిజన్లను సన్మానించారు.

◆ గోదా కల్యాణంలో పాల్గొన్న వంటేరు

గజ్వేల్: మండలంలోని దిలాల్‌పూర్ లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన గోదా రంగనాథస్వామి కల్యాణ మహోత్సవంలో మాజీ అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ సేవాదళ్ పట్టణ అధ్యక్షుడిగా అమరేశ్వర్‌రెడ్డి



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా గుర్రం అమరేశ్వర్‌రెడ్డి నియామకమయ్యారు. ఈమేరకు శనివారం సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ సూచన మేరకు సిద్దిపేట అసెంబ్లీ ఇన్‌చార్జ్ పూజల హరికృష్ణ నియామకపత్రం అందించారని జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తెలిపారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారన్నారు. కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బొమ్మల యాదగిరి, ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ చాకరిమెట్లలో భక్తుల పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో భక్తజన సందడి నెలకొంది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు సత్యనారాయణస్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. సీతారామచంద్రస్వామి ఆలయంలో కూడా పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, తదితరులు ఉన్నారు.